ఆ మనసు తిరిగి రాదు.... ఆ రూపం చెరిగిపోదు.... శరత్ .... నన్నెందుకు భగ్న ప్రేమికురాల్ని చేశావ్ ?

కిరణ్మయి మనసు మౌనంగా రోదించింది... అతన్ని దూషించలేకపోతోంది ఆమె.... అతన్ని అసహ్యించుకోలేక పోతోందామె.

అతను ఏ ఉద్దేశ్యంతో అలా ప్రవర్తించినా .... ఏది మనసులో ఉంచుకుని అలా ప్రవర్తించినా అతను తన ప్రేమికుడు... అంతే !

తనెందుకు అతనికి పెళ్ళి అయ్యిందేమోనని ఆలోచించ లేకపోయింది....?

తను మాత్రం ఎందుకు తొందరపడి మనసు అర్పించుకోవాలి ?

అతను అందంగా ఉన్నాడు.. సమ్మోహనకరంగా మాట్లాడుతున్నాడు .... మంచితనం కనబరుస్తూ చేరువగా మసలుతున్నాడు....

అది చూసి అతన్ని ప్రేమించేసింది.. మనసు అర్పించుకుంది....

ఏమనుకుంటే ఏం లాభం ?.... తను నష్టపోయింది.... తను 'ప్రేమ' అనే మాటకు దూరం అయిపోయింది....

కిరణ్మయి వెళ్ళుతూంటే శరత్ బాబుకి ఏం మాట్లాడాలో తోచలేదు....

* * *

కిరణ్మయికి ఇక విజయవాడలో ఉండాలనిపించ లేదు.... రాజీనామా లేఖ వ్రాసి పోస్టులోవేసి విశాఖపట్నం బయలుదేరింది.

శరత్ బాబుని తప్పు పట్టలేకపోతోంది ఆమె.

పరస్పరాకర్షణ !

దట్సాల్ —

అది అతన్ని నిజం చెప్పనివ్వలేదు అన్నిరోజులు. అతను నిజాయితీపరుడు.. అందుకే చివర్నికూడా రహస్యం రహస్యంగా ఉంచేయలేదు.

అలాగే చేసుంటే మరో ఆడదాని జీవితంలోకి ట్రెస్‌పాస్‌చేసి మన్నించబడనంత నేరం చేసుండేది !

ఇప్పుడు నరకయాతన తనవరకే పరిమితమైంది.

కిరణ్మయికి మనసంతా బరువుగా ఉంది.

ఆ బరువు నెలా తగ్గించుకోవటం ?

అది సాధ్యమయ్యే పనేనా ?

తన ఆడమనసు పడిన తొందరపాటుకి ఆ బరువుని జీవితాంతం అలా మోస్తూ ఉండటమేనా ?

అంతేనేమో !!

కిరణ్మయి విషాదంగా నవ్వుకుంది — కన్నీళ్ళు పొంగుతూ వస్తూంటే !



# బండరాళ్ళు

## మధుచక్రవర్తి

మండు వేసవి !

ఎండ మండిపోతోంది....

వడగాడ్పు.... వేడిగాలి....

ఒక్క మబ్బుతునకైనా లేని ఆకాశం, వట్టిపోయిన గోవులా, ఎండిపోయిన చెరువులా ఉంది.

అదంతా బీడువడ్డ బంజరు.

అక్కడక్కడా గుబురు గుబురుగా బలిసిన బలుసు .... బొమ్మజెముడు పొదలు.... — ఆ పొదల మధ్యగా, మేకను మింగి, మెలికలు తిరిగి, ఎటూ కదల్లేక పడున్న కొండచిలువలాంటి నాటు దారి....

ఆ దారి తిన్నగా "దాసరిమెట్ట"కు పోతుంది.

నిశ్శబ్దం.... నిర్మానుష్యం....

ఉండి ఉండి దూరంగా తుమ్మతోపు లోంచి అడవి పావురాలు 'గుర్ గుర్' మంటున్నాయ్.

నోటితో వింతగా చప్పుడు చేస్తూ, గిత్తల్ని అదిలిస్తూ బండిని తోలుతున్నాడు దేవుడు.

బానిసత్వానికి, వెట్టిచాకిరికి ప్రతినిదుల్లా, తలలూపుతూ బండిని లాగుతున్నాయి గిత్తలు. వాటి నడకకు లయగా శ్రుతిచేస్తూ మోగుతున్నాయి వాటి మెళ్ళో కట్టిన చిరుగంటలు.

దారంతా అతుకులు గతుకులుగా ఉం[illegible]... సరైనమందులు




వాడక, జ్వరం బాగా ముదిపోయింది. ఇది మామూలు జ్వరం కాదు; మలేరియా! తెల్సిందా? చాలా జాగ్రత్తగా చూసుకోవాలి. సరైన మందులు, ఇంజక్షన్లు సకాలంలో ఇవ్వకపోతే, కుర్రాడి ప్రాణాలకే ప్రమాదం! బలానికి టానిక్కు, గ్లూకోజ్ లాంటివి వాడటం ఎంతైనా అవసరం. పాలు, రొట్టె తప్పని సరిగా యివ్వాలి. అశ్రద్ధచేస్తే, చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టవుతుంది. ఇదిగో – ఈరోజే మందులు మర్చిపోకుండా పట్రా....” పొద్దుట డాక్టరుగారి హెచ్చరిక.

“మావాఁ.... యిన్నావ్‌గా డాక్టోరి మాటలు.... యియ్యాలన్నా, అయ్యగోర్నడిగి పదో పరకో పట్టుకురా.... నేకపోతే బొట్టుడు మనకు దక్కడు ....” కొంగుతో కన్నీళ్ళొత్తుకుంటూ భార్య అర్థింపు....

చక్రం గతుకులో పడి బండి అదిరింది. నొసలు చిట్లించి ఎడంచేత్తో నుదురు వత్తుకున్నాడు దేఁవుడు.

నిరాశ....నిస్పృహ....

అల్లంత దూరంలో, తాటిచెట్టెత్తున్న గిర్రున తిరుగుతూ, ధూళిని రేపుకుంటూ దూసుకొస్తోంది సుడిగాలి! అరిచేతిని ముఖానికి అడ్డం పెట్టుకున్నాడు దేవుఁడు. గిర్రున సుళ్ళు తిరుగుతూ మీదనుంచి దూసుకుపోయింది సు[…]లకు చుట్టిన గుడ్డ తీసి, ద[…]



కున్నాడు. ఒక్కసారి కళ్ళు మండాయి.

అంతలో –

“ఏరా.... పక్కనుండి యెల్లేవా.... గాడిదకొడక....” ఖరీదైన గొంతు గర్జించింది, దుమ్ము లేపుకుంటూ పక్కనుండి ముందుకి దూసుకుపోయిన నల్లటి కారులోంచి.

“అయ్యగోరు....” గొణిగాడు దేఁవుడు, మొహానపడ్డ దుమ్ము తుడుచుకుంటూ.

అవును– ఆ కారు ....ఆ గొంతు.... ఆ గొంతులోని కరుకుదనం, కాఠిన్యం .... అన్నీ పోతురాజు బాబు గారివే.... ఆ కారును చూసినపుడల్లా ‘అందల కూకుంటే ఎలా ఉంటదో’ అనుకుంటుంటాడు తను.

“అయ్యగారికి కోపమొచ్చిందేమో...” భయపడ్డాడు దేవుఁడు. కారణం.... తనకీరోజు డబ్బు అవసరం. అవును చాలా అవసరం! తన ఒక్కగానొక్క కొడుకు జ్వరంతో చావుబతుకుల్లో ఉన్నాడు. ఈ రోజు ఎలాగైనా మందులు కొని పట్టుకెళ్లాలి!

తండ్రి ఎవరినో తిట్టడం చూసి, “హూ డాడీ....” అడిగాడు ఇంగ్లీషు కాన్వెంటులో చదువుకుంటున్న ఆరేళ్ళ రవిబాబు; అప్పుడప్పుడే నేర్చుకుంటున్న బుల్లిబుల్లి యింగ్లీషు పలుకుల్తో. “మన దేవుడుగాడు” చెప్పాడు పోతురాజు; కుడిచేత్తో స్టీరింగ్ చక్రం తిప్పుతూ,





మరోచేత్తో కొడుకు వీపుని ప్రేమగా నిముర్తూ; కొడుకు యింగ్లీషు పలుకులకు మురిసిపోతూ.

“దేఁవుడు” అనగానే ఆసక్తిగా కాస్త పక్కకి జరిగి, కారు కిటికీలోంచి వెనక్కి, దేఁవుడి ఎడ్లబండికేసి చూసాడు రవిబాబు. ఎద్దుల బండికి, కారుకీ మధ్య ఎంతో దూరం!

దూరంగా కనిపిస్తున్న ఎద్దులబండి మీద కూర్చున్న దేఁవుడు సరిగా కనిపించలేదు రవిబాబు కళ్ళకు. అంతకంతకూ పెరిగిపోతున్న దూరం వలన మెల మెల్లగా.... చివరకు పూర్తిగా మసకబారి మాయమైపోయింది దేఁవుడి ఎండ్లబండి దృశ్యం.

మెట్టకు కొంచెం దూరంగా కారాపి, ఓ చేత్తో కొడుకును పట్టుకుని, మరో చేత్తో చేతికర్రను కదిలిస్తూ, మెట్టకేసి నడిచాడు పోతురాజు.

కరుడు కట్టిన పాపంలా– పాపాల పుట్టలా, ఎండలో నల్లగా వికృతంగా మెరుస్తోంది “దాసరిమెట్ట.”


కొంతమంది కొండమీది బండలకు కన్నాలు పెడుతున్నారు డ్రిల్లింగ్ మెషిన్లతో; తరువాత ఆ కన్నాల్లో మందుగుండు దట్టించి, ఆ బండల్ని పేల్చడానికి మరి కొంతమంది పెద్దపెద్ద సుత్తులతో రాతిబండల్ని బద్దలు కొడుతున్నారు. అలసిన వారి దేహాలనుండి ఊరి, కారుతున్న చమట చుక్కలు ఎండలో ‘తళుక్’న మెరిసి, అంతలోనే ఆ రాతి బండలపై పడి యింకిపోతున్నాయి

జీవితపు చరమాంకంలో, విశ్రాంతి తీసుకుంటూ, గతాన్ని నెమరువేసుకుంటూ, నిశ్చింతగా శేషజీవితాన్ని గడపాల్సిన వృద్ధులు.... గడప దాటకుండా, గృహిణులుగా తమ సంసారాల్ని చక్కదిద్దుకోవాల్సిన స్త్రీలు.... బుద్ధిగా బడికెళ్ళి, పాఠాలు నేర్చుకుని భవిష్యత్తుకు బంగరు బాటలు వేసుకోవలసిన పిల్లలు.... వీళ్లంతా ఆ కొండ దిగువభాగంలో పోగులు పోగులుగా ఉన్న ఆ రాళ్లగుట్ట ముందు, గుంపులు గుంపులుగా చేరి, చిన్నచిన్న సుత్తులతో రాళ్లను చిన్ని చిన్ని ముక్కలుగా చితక్కొడుతున్నారు.

....ఆ రకరకాల చప్పుళ్లన్నీ కలిసి, కలగాపులగంగా, కొత్తగా వినిపిస్తూ “శ్రమ” అనే శీర్షికకు సరిపోయే దృశ్యంలా ఉందా ప్రదేశం.

పోతురాజు చేతికర్రను నేలకేసి కొడుతూ, ఠీవిగా నడుస్తూ బానిసలతో పనిచేయిస్తున్న రోమన్ సైన్యాధికారిలా ఒక్కొక్క కూలీదగ్గర కెళ్ళి, అవసరమున్నా లేకపోయినా గట్టిగా కేకలేస్తూ తన హోదా(?) ను ప్రదర్శిస్తున్నాడు.

అతను యజమాని కావడంతో కూలీలందరూ గౌరవంగా – కాదు, భయపడుతూ లేచి నిలుచుని, ఏదో తప్పు చేసినవా[…] తలలొంచుకుని సమాధా[…]రు.



తండ్రి ఎందుకలా అనవసరంగా కేక లేస్తున్నదీ, వాళ్ళెందుకలా భయపడు తున్నదీ అర్థంకాక, అమాయకంగా తండ్రివైపు కూలీలకేసి, మార్చి మార్చి చూస్తున్నాడు రవిబాబు

ఆ ముసలి వ్యక్తికి, అరవై ఏళ్ళపైనే ఉంటుంది వయసు. హాయిగా చుట్ట కాల్చు కుంటూ, ఏ నులకమంచంమీదో పడు కుని అరవైయేళ్ళ శ్రమకు అలుపు తీర్చుకోవాల్సిన వయసులో, ఎండకు ఎండి, వానకు తడిసే రాళ్ళగుట్టలమధ్య శిథిలమైన శిల్పంలా ఉన్నాడా వృద్ధుడు. ఎముకల గూడుపై తోలుతిత్తి తొడిగి నట్టుంది అతని దేహం. ఒంటికి గోచీ తప్ప మరో ఆచ్ఛాదనలేదు. తలొంచు కుని, సుత్తితో రాళ్ళను చిన్న చిన్న ముక్కలుగా చితక్కొడుతూ, మధ్య మధ్య తెరలు తెరలుగా దగ్గుతున్నాడు. అలా దగ్గుతున్నప్పుడు కదులుతున్న అతని పక్కటెముకలు ఎండలో వింతగా మెరుస్తున్నాయి.

"ఏరా....అప్పన్నా.... ఏటి పజ్జేస్తు న్నావా ? కునుకుతున్నావా ? ...."

పోతురాజు రాకను ఆ వృద్ధుడు గమ నించినట్టు లేదు; అతని మాటలు విని పించుకున్నట్టూ లేదు. ఎప్పటిలాగే తలొంచుకుని, సుత్తితో రాళ్ళను చిత క్కొడుతున్నాడు.

తన ఉనికిని గుర్తించనందుకు పోతురాజు అహం దెబ్బ[illegible]గా చేతికర్రతో ఆ వృద్ధుడి ఎండిన తొడపై ఒక్క పోటు పొడిచాడు. కుష్కించిన ఆ మాంసపుముద్దలో యింకా, ఎక్కడో ఏ కోశానో స్పర్శ మిగిలి ఉందేమో....

ఆ వృద్ధుడు బాధతో మూలిగి, తలెత్తి కళ్ళు చిట్లిస్తూ చూసాడు. చూపు సరిగా ఆనడంలేదు కాబోలు, ఎదురుగా మసక మసగ్గా పోతురాజు ఆకారం కనిపించే సరికి, వణకుతున్న ఆ వృద్ధశరీరం మరింత వణికింది. అతికష్టంగా మెల్లగా లేచి నిల్చుని, "దండాలు బాబయ్యా...." రెండుచేతులు జోడిస్తూ అన్నాడు.

"ఏం....దొరగారికి పొగరెక్కి చెవులు యినబడ్డం లేనట్టుంది...." పోతురాజు కోపం యింకా తగ్గలేదు.

"నేదు బాబయ్యా.... ముసలిముండా కొడుకుని, సరిగా యినబడదు, అగు పడదు." భయపడుతూ సంజాయిషీ యిచ్చుకున్నాడా వృద్ధుడు.

"ఊఁ.... సరేగాని, ఆడేడి.... నీ కొడుకు, సింహాచలంగాడు...యియ్యాల పన్లోకి రాలేదా ?" హుంకరించాడు పోతురాజు.


"ఆడా బాబయ్యా....మా కోడలిపిల్లకి కానుపొచ్చిందయ్యా .... పెల్లాంబిడ్డని సూడ్డానికి 'యేపగుంట' యెల్లాడు. నానే యెల్లమన్నాను. మల్లా రేపు పన్లో కొచ్చే త్తాడు...."

"మా గొప్పపని చేసేడు. పెల్లాం బిడ్డని చూడ్డానికి పనిమానేసే యెల్లాలా యేటి ?" అళ్ళను చూడకపోతే పన్చెయ్య నేడా? అయినా మీకు పన్లెందుకంట్రా..." కసురుకుంటూ ముందుకు కదిలాడు పోతురాజు.

— ఆ స్త్రీకి పాతికేళ్ళ వయసుం టుంది. కవులు తమ కావ్యాల్లో కవనాల్లో ఎంతో అందంగా, మనోహరంగా వర్ణించే ముగ్ధమోహన కావ్యనాయిక కాదామె.

చమురు సంస్కారం లేక దుమ్ము కొట్టుకుపోయిన జుట్టూ....ఎండకు వాడి, మాడి జిడ్డోడుతున్న ముఖం.... సుత్తితో రాళ్ళను కొడుతోంది. ఆమె మొహంలో ఎలాంటి భావమూ లేదు. నిర్లిప్తంగా రాళ్ళను కొడుతోంది; టక టక మని. యాంత్రికంగా కదులుతున్నా యామె చేతులు.

నగ్నంగా ఉన్న, కుష్కించిన ఆమె ఎడమరొమ్మును తన బుల్లిచేతుల్తో లాగుతూ, నోటితో చీకుతున్నాడొక పసి పిల్లవాడు. మాంసంలేని ఎముకను చీకుతూ, వృథా ప్రయాస పడుతున్న కుక్కపిల్లలా.



"ఏఁవే – నూకాలు.... యీణ్ణికూడా యీడకే తీసుకురావాలా? పూరేగ దానికి ...." చేతి కర్రతో కుర్రాడిని చూపిస్తూ అన్నాడు పోతురాజు.

పోతురాజు గొంతు విసిపించేసరికి, బెదురుతూ లేచి నిలుచుని, నగ్నంగా ఉన్న రొమ్ము పైకి పైట కొంగు లాక్కొంది. చినిగి చీనికలైన ఆ పైట కొంగు ఆమె అసహాయతను ఆదుకోలేక పోయింది.

ఆ స్త్రీ సిగ్గుపడుతూ, "అడు నన్నొదిలి ఉండలేడు బాబు...." తలెత్తకుండానే సమాధానం చెప్పింది.

"అహఁ.... ముద్దుల కొడుకుని ఒదిలుండలేకపోతున్నావన్నమాట. యింతకీ పనేఁవన్నా చేస్తున్నావా....లేక ఆడితోనే ఆడుకుంటున్నావా?" వెటకారం ధ్వనించిందా గొంతులో.

"అసలు ఆడు నిన్నొదిలుండలేక పోతున్నాడా – నువ్వాడ్నొది లుండలేక పోతున్నావా?"

ఆ ప్రశ్నకు ఆమె సమాధానం చెప్పక, తలొంచుకుని, తన పాదాలను వాటేసుకుంటున్న పసిబిడ్డణ్ణి చూస్తూ ఆగిపోయింది.

"అద్సరే.... ఆ దేడి నీ మొగుడు చింతల్లిగాడు – పన్లోకి రాలేదా?"

"జొరం బాబు.... రెండు రోజుల్నుండి కదల్లేకపోతుండు. నేనే పన్లోకి రావద్దన్నాను. గుడిసెల్లో పడుకుండు...."

"అబ్బోసి .... మీకు పేవఁ కేటీ లోటులేదే....మరి నువ్వూ, ఆడిపక్కనే యెల్లి తొంగోపోయావా? ఇక్కడి కెందుకొచ్చావ్?" అసభ్యత తొంగి చూసిందా మాటల్లో.

"మీరు సుఖాలు మరిగిపోయారే...." సాగదీసి అంటూ అక్కణ్ణించి కదిలాడు పోతురాజు.

అక్కడ అందరూ అలా పెద్ద పెద్ద రాళ్ళను చిన్న చిన్న ముక్కలుగా చితకొట్టడాన్ని వింతగా, ఆసక్తిగా పరికిస్తూ తిరుగుతున్నాడు రవిబాబు.

యింతలో దేఁవుడు బండితోలుకొచ్చాడక్కడికి. ఇద్దరు కూలీలు తట్టల్తో, చితక్కొట్టిన చిన్నచిన్న రాళ్ళపిక్కల్ని బండిలో పోస్తున్నారు.

"అయ్యగోరూ...."

ఎదురుగా చేతులు కట్టుకుని నిలుచున్న దేఁవుడివంక చిరాగ్గా చూసి, "ఏఁరా.... నీకేవైంది.... ఏం, నీపెల్లాని కేవఁన్నా రోగమొచ్చిందా" తన కోపాన్నంతా దేఁవుడిమీద వెల్లగక్కాడు పోతురాజు.

దేఁవుడు భయపడ్డాడు.

"అయ్యగోరు కోపంలో ఉన్నారు.... యిప్పుడు అడక్కూడదు" అనుకున్నాడు. కానీ....అడగాలి! అవసరం! తప్పదు. అడిగేద్దామనుకున్నాడు. అడిగేముందు దేఁవుడు మనసులో దేవుడికి దణ్ణంపెట్టుకున్నాడు.

"నేదు బాబయ్యా....మా సిఁవాద్రికి మలేరియ జొరవంట .... సూది మందులు .... టానిక్కులు వాడాలని డాక్టరయ్య చెప్పాడు. నా కూల్డబ్బుల్లో యిరగ్గొట్టుకుందురుగాని, వొక యాభై రూపాయ లిప్పించండి బాబు...."

పోతురాజు ఆశ్చర్యపోయినట్టు కళ్ళు పెద్దవిచేసి –

"ఏందిరా.... ఒక్క యేబయ్యేనా.... రొండు యాభైలొద్దూ ....ఏం దర్జాగా అడిగేశావురా.... నీ బాబుసొమ్ము దాసి పెట్టేసినట్టు. ఏం, టానిక్కులు వాడకపోతే నీ ముద్దులకొడుకు చచ్చిపోతాడా? మాట్లాడితే డబ్బు! డబ్బు! ఊఁ.... ముందు పన్జూడు. కొంపేం మునిగిపోదు గాని...."

దేఁవుడికి దుఃఖం ముంచుకొచ్చింది.

అయింది! తను అనుకున్నంతా అయింది. తన కున్న ఒక్కగానొక్క ఆశ.... పోతురాజుబాబే....అయనే కాదనే సరికి దేఁవుడికి కళ్ళనీళ్ళు నిలిచాయి. ఎగేసే దుఃఖాన్ని దిగతోసుకుంటూ, "అదికాదు బాబూ .... యియ్యాలగాని మందులు కొనకపోతే, బిడ్డడు దక్కడు బాబు....డాక్టరయ్య....మీ మేలు మర్చిపోను... నా బిడ్డపేణం రచ్చించినోరవుతారు...." దుఃఖంతో దేఁవుడిగొంతు పూడుకుపోయింది.

"ఏట్రా....కొడుక్కొడుకని గింజుకుంటావ్. ఆడేం బతికి, రేపొద్దున్న నీ కూడెడతాడనా? కంగారు పడిపోక నా మాటిని, నింపాదిగా ధర్మాసుపత్రికి తీసుకెల్లు....అదే తగ్గిపోద్ది...."

పోతురాజు దృష్టిలో అదేమంత ఆలోచించాల్సిన సమస్యలా అనిపించ లేదు.

ధర్మాసుపత్రిలో మందులుండవనీ, అసలు డాక్టర్లే ఉండరనీ, ధర్మాసుపత్రికి తీసుకెళ్ళడమన్నా, కాటికి తీసుకెళ్లడమన్నా ఒకటేనన్న సంగతి, దేఁవుడిలాంటివాళ్ళకి తెలిసిన నిజమే!

"దరమాసుపత్రిలో అలాంటి మందులియ్యరంట బాబయ్యా....మనవేఁ కొనుక్కోవాలంట, డాక్టరయ్య చెప్పాడు. మీమీదే ఆశెట్టుకుణ్ణు, నా బిడ్డణ్ణి..." యిక మాట్లాడలేకపోయాడు దేఁవుడు. ఉబికిన కంటినీరు ఒలికిపోయింది.

పోతురాజుకి చిర్రెత్తుకొచ్చిఁది! ఎంతకీ తన మాట పట్టించుకోకపోయే సరికి, "ఒరేయ్....నువు డబ్బులిచ్చి బాగు చేయించుకుంటావో .... దర్మాసుపత్రికి తీసుకెళ్తావో.... నా కెందుగ్గాని, నేను మాత్రం పైసా యియ్యను. యిక అనోసరంగా వాక్కుండా ముందు పన్జూడు. ఊఁ...." హూంకరించాడు పోతురాజు.

తన రక్తమాంసాలు పంచుకుని, తన జీవాన్ని పోసుకుని పెరిగిన బిడ్డ, తన కళ్ళముందే, చావుబతుకులమధ్య కొట్టు

మిట్టాడుతుండే.... ఒక తండ్రిగా తను భరించగలడా ?

దేవుడు యిక మాట్లాడ్లేకపోయాడు. ఒక్కసారిగా పోతురాజు కాళ్ళమీద పడిపోయాడు. పట్టరాని దుఃఖాన్ని కన్నీళ్ళగా పోతురాజు పాదాలమీద పదిలపరిచాడు.

యింతలో –

విజిల్ వూదారు; 'బ్లాస్టింగ్'కి టైమైందంటూ.

కూలీలంతా లేచారు.

పోతురాజు కాళ్ళతో విదిలించి, దేవుణ్ణి పక్కకు తోసేస్తూ, నిర్లక్ష్యంగా ముందుకు, కారువైపు నడిచాడు.

దేవుడు లేచి కళ్ళతడిని తుడుచుకుంటూ, చుట్టూ కలయజూసాడు.

కూలీలంతా కొండకు దూరంగా వెళ్ళిపోతున్నారు. చేసేదిలేక, ఏం చెయ్యాలో తెలియక, దేవుడు బేలగా ఎడ్లబండిని నడిపించుకుంటూ నడుస్తున్నాడు. కొంతమంది ఎర్రని జెండాలు పట్టుకుని మెట్టచుట్టూ నిలుచుంటున్నారు. కూలీలంతా మెట్టకు దూరంగావెళ్ళి నిలుచుంటున్నారు.

యిపుడు మెట్టమీది పెద్దపెద్ద బండల్ని పేలుస్తారు. ఎవరూ కొండ దరిదాపుల్లోకి పోకూడదు.

"ఈ ఒక్కసారికి నామీద దయదల్చి, నా బిడ్డపేణం కాపాడండి బాబయ్యా.... మీరేం చెయ్యమంటే అది చేస్తాను. మీ రుణం ఉంచుకోను" చేతులు జోడించి అంటున్న దేవుడి మాటలు, వినిపిస్తున్నా వినిపించుకోకుండా విసురుగా కారు తలుపు తెరవబోతూ, ఏదో గుర్తొచ్చిన పోతురాజుకి గుండాగినంత పనైంది.

"ఒరేయ్.... ఒరేయ్ దేవుడూ.... బాబేడ్రా....బాబు ....రవిబాబు...." భయంతో నిలువుగుడ్లేసి అరుస్తున్నాడు పోతురాజు. కూలీలను తిడుతూ, తనబాబు సంగతే మర్చిపోయాడు.

దేవుడు గాభరాగా చుట్టూ చూసాడు. కనుచూపుమేరలో రవిబాబు జాడ కనిపించలేదు.

కూలీల్లో కలకలం మొదలయింది.

"ఒకేల కొండకాడుంది పోన్రేవోఁ బాబు....నాను చూసొస్తాను...." అంటూ గాభరాగాకొండకేసి పరిగెత్తాడు దేవుడు.

అసలిప్పుడా ప్రాంతాల కెళ్ళడం చాలా ప్రమాదం। పగిలిన బండలు పైన పడ్డాయంటే ప్రాణాలకే ముప్పు. మెట్ట దగ్గరకు పరిగెడుతున్న దేవుణ్ణి అటకాయించారు ఎర్రజెండాలు పట్టుకున్న మనుషులు. ఒక్క ఉదుటున వాళ్ళను



విదిలించుకుని ముందుకి పరుగెడుతున్నాడు దేవుడు.

కారుదగ్గర నిలుచున్న పోతురాజు భయంతో పిచ్చివాడిలా చూస్తున్నాడు కొండకేసి.

దేవుడు పరిగెడుతున్నాడు.

అడుగడుక్కీ కొండకు దగ్గరౌతున్నాడు. కూలీలంతా ఊపిరి బిగబట్టి, రెప్పవేయకుండా చూస్తున్నారు దేవుడివైపు.

దేవుడు కొండదగ్గరకు చేరిపోయాడు

పోతురాజుకి చెమటలు పడుతున్నాయి. మనిషి అల్లకల్లోలమై పోతున్నాడు.

ఇపుడు దేవుడు ఎవరికీ కనిపించడం లేదు; మెట్టకు అవతలివైపుకు వెళ్ళడం వలన.

పోతురాజు దుఃఖంతో మెలికలు తిరిగిపోతున్నాడు. అతను బాధపడుతున్నది దేవుడికోసం కాదు; తన ముద్దుల కొడుకు అయిన రవిబాబు కోసం.

ధన్....ధన్....ధన్....

ప్రేలుళ్ళు వినిపిస్తున్నాయి. పగులుతోన్న పెద్ద పెద్ద రాతిబండలు ఎగిరెగిరిపడుతున్నాయి.

ఆ ప్రదేశమంతా గుండెలదిరే శబ్దాలతో నిండిపోయింది.

దేవుడు, రవిబాబుల జాడేలేదు.

కొంతసేపటికి ప్రేలుళ్ళు ఆగిపోయాయి.

ఆ ప్రదేశమంతా నిశ్శబ్దమై ధూళితో నిండిపోయింది.

కొండ స్పష్టంగా కనిసించడంలేదు; పైకెగిసిన ధూళివలవ.

పోతురాజు కళ్ళనుండి నీళ్లుజారాయి.

పోతురాజు యిపుడు ఏడుస్తున్నాడు.

నిజంగా ఏడుస్తున్నాడు.

గుండె లోతుల్లోంచి ఏడుస్తున్నాడు.

మామూలు మనిషిలా ఏడుస్తున్నాడు.

అసలైన మనిషిలా ఏడుస్తున్నాడు.

మమతలు, మమకారాలు ఉన్న మనిషిలా ఏడుస్తున్నాడు.

ఒక బిడ్డను కన్న తండ్రిలా ఏడుస్తున్నాడు.

వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు.

ఎర్రజెండాలు కదిలాయి.

కూలీలంతా అరుస్తూ, గోలచేస్తూ కొండకేసి పరిగెడుతున్నారు. వాళ్ళతో పాటే వాళ్ళకన్నా ముందు పరిగెడుతున్నాడు పోతురాజు.

లక్షాధికారి పోతురాజు.

కారున్న పోతురాజు.

అ పరుగులో అదికారం లేదు; అహంకారం లేదు; దర్పం అంతకంటే లేదు.

ఆ క్షణంలో తన లక్షలు ....

కారులు .... మేడలు .... హోదా.... అంతస్తు.... యివేమీ గుర్తురాలేదు పోతురాజుకి.

ఏడుస్తూ పరిగెడుతున్నాడు; కింద అడ్డంగా పడున్న రాళ్ళను తప్పుకుంటూ. పిచ్చివాడిలా పరిగెడుతున్నాడు. పరిగెడుతున్న పోతురాజు కొయ్యబారిపోయాడు, ఎదురుగా కనిపించిన దృశ్యం చూసి.

రక్తసిక్తమైన దేహంతో, ఉండచుట్టుకుని పడున్నాడు దేవుడు. అతన్లో జీవం లేదు. ఆ దేహంలో చలనం లేదు.

శ్వాస ఎప్పుడో ఆగిపోయింది. కొద్ది క్షణాల క్రితం యాభై రూపాయలకోసం ఆరాటపడ్డ అతనిలో యిపుడు ఎలాంటి ఆరాటమూ లేదు; ఆవేదనా లేదు.

నిశ్చలంగా .... నిశ్శబ్దంగా పడి ఉన్నాడు.

చితికిపోయిన మాంసపు ముద్దలా ఉందా దేహం.

ఆ మాంసపు ముద్ద కౌగిటిలో సురక్షితంగా, పదిలంగా ఒదిగి ఉండి, భయంతో ఏడుస్తున్నాడు పోతురాజు ముద్దులకొడుకు రవిబాబు. ఆ ఘోర కృత్యాన్ని చేసిన నేరస్తుల్లా చుట్టూ, చెల్లాచెదురుగా పడివున్నాయి పెద్దపెద్ద రాతిబండలు....

పోతురాజు గుండెలాంటి నల్లటి రాతిబండలు....

....జరిగిపోయిన ఘోరానికి పశ్చాత్తాపంతో కన్నీరు కారుస్తున్నట్టు నల్లటి రాతిబండలపై ఎర్రటి రక్తపు ఛారికలు... పోతురాజు కళ్ళల్లో కన్నీళ్ళలా.



D.L. Book lending Library

# ఆకలి



## చాట్ల నారాయణమూర్తి రాజు

కృష్ణబాబు బాగుంటాడు. అతను చాలా చక్కగా వుంటాడు. అతను అందంగా నవ్వుతాడు. హుందాగా నడుస్తాడు. వంకీల జుత్తు, అంతంత పెద్ద కళ్ళు, వెడల్పాటి నుదురు, ఎర్రటి ముఖం, ఆరడుగుల ఎత్తు, అతని ఠీవిని తెలియబరుస్తుంటాయి. అతను విదేశాల్లో చదువుకున్నాడు. అందువలన కొన్ని నియమాలు పాటిస్తుంటాడు. ఉదయం ఎట్టి పరిస్థితుల్లోనూ తొమ్మిది గంటలకు ఇంటినుంచి బైల్దేరతాడు. సాయంత్రం మళ్ళీ ఐదు గంటలకల్లా ఇంటికి వచ్చేస్తాడు.

సమయాన్ని అనవసరంగా బైట గడపటం అంటే అతని కిష్టంలేదు. అతను తక్కువగా సినిమాలు చూస్తాడు. ఎక్కువగా ఇంట్లో టెలివిజన్ చూస్తాడు.